

# ది ప్రణయలత భీమా కంపెనీ

మల్లవరపు సుబ్బారావు, బి ఏ, బి ఇడి, యు. ఏ

జీవితాల మొసలు చిటకెన వేలు చిట్టి గోరుకూడా భీమా చేయించుకునే నాగరకతా పవనం, పడమర బయలుదేరి తూర్పు గోళాన్ని తొంగి చూస్తోంది. బుచ్చయ్య బుగ్గమీసాలు, వారిజాక్షి వాలుజడ, పాపాయమ్మ ప్రక్కపాపిటా కూడా పంతంతో భారీ మొత్తాలికి భీమా చేయించుకునే కాలం వచ్చింది ఇందుకే 'Multitude are fools' అన్నాడు వో కవిశేఖరుడు

ఈమధ్య బృందావనం దగ్గరున్న మన్మథపూర్ లో 'ప్రణయలత భీమా కంపెనీ' పేరుతో వో భీమా కంపెనీ బయలుదేరింది దానికీ హెడ్డాఫీసనీ, కార్యనిర్వాహకవర్గమనీ, ఏజంట్లనీ హంగులన్నీ వున్నాయి సదరు కంపెనీ నిబంధనలు కొన్ని ఈక్రింద పొందుపర్చాను. వలయువారు కంపెనీ ఆదర్శాలు గ్రహించి పోలసీ హోల్డర్లుగా చేర్తారని నమ్మకం కాని కొంపదీసి నేనా కంపెనీ ఏజంటు ననుకునేరు! ఎంత మాత్రం కాదు సుమండీ

కార్యనిర్వాహకవర్గం

1 శ్రీయుత శశాంకయ్యార్ M L C.
2 దివ. బ. ధాతువృద్ధి గౌండర్
3 శ్రీ మురళీకృష్ణశాస్త్రిగళ్
4 శ్రీ మానినీ చిత్తచోరాచారియర్ L L B D
5 శ్రీమతి మదనకామేశ్వరీబాయి
6 మిస్ తారాదేవి

హెడ్డాఫీసు
మన్మథపూర్.

ఆడిటర్లు
సంతానం కంపెనీ లిమిటెడ్
ఛార్టర్డ్ అక్కవుంటెంట్సు

బ్యాంకర్సు
క్రీడావిలాస్, బ్యాంకింగ్ హౌస్, మన్మథపూర్.

నిబంధనలు

నామకరణం —ఈకంపెనీ 1934 జనవరి నెల 2B చట్టాన్ననుసరించి నమోజు చేయబడి 'ది ప్రణయలత భీమా కంపెనీ' అని పిలవబడుతుంది.

ఆశయములు —స్త్రీపురుషులకు మధ్య ప్రణయలతని మొలిపించి, పెంచి, వో పెద్ద తరువుగా వృద్ధిచేసి, పళ్లు, కాయలు కాపించి, పోలసీదార్లకి అందచేయడం ముఖ్య ఆశయం. చంచల ప్రేమనీ, సంతాన నిరోధాన్నీ సంఘంలోనించి తరిమెయ్యడం ఇతరములు.

ఎవరు భీమా చేయవలెను.—శారదా చట్టాన్ననుసరించి 14 పళ్లు దాటిన స్త్రీలు, 18 పళ్లు

దాటిన పురుషులు మాకంపెనీ పోలసీలు పొంద వచ్చును. స్త్రీలకి 14 మొదలు 25 వరకునూ, పురుషులకు 18 మొదలు 30 ఏళ్ల వరకునూ ప్రీమి యములు క్రమేణా హెచ్చి, పిమ్మట క్రమంగా తగ్గుతాయి.

భీమా చేయించుకోదలచిన స్త్రీగాని పురు షుడుగాని, కోరి ఎంచుకున్న సహవాసి (Mate) తో చేరి ఒక్కొక్క పోలసీ పుచ్చుకోవలెను. వారి వయస్సులు, స్త్రీ: పురుషుడు: 14. 18 నిష్ప త్తిలో వుండాలి. వయస్సులో ఇతర పరిమితి పాటింపబడదు.

డాక్టరు పరీక్ష:—ఈ పరీక్షెందుకంటే నపుం సకులూ, common gender వ్యక్తులూ ఈ పోల సీలు పొందటానికి అనర్హులని తేల్చడానికి. నర ముల బలహీనతున్నవారికి ప్రీమియములు హెచ్చించడానికి, అట్టి దుర్బలురకు కంపెనీ డాక్టర్లు వారి పేటెంటు మందుతో Normal స్థితి చేకూరుస్తారు.

పోలసీ ఎప్పుడు మెచ్యూరగును.—ప్రణయలత పుష్పించి ఫలోన్ముఖం చెంది, ఫలాలు ఒక సం॥ వరకూ జీవించివున్నప్పుడుగాని, ప్రణయలత మధ్యలో తెగి దంపతులు విడాకు లుచ్చుకున్నప్పు డుగాని, దంపతులలో ఎవరుగాని చనిపోయినప్పు డుగాని, భీమామొత్తం పోలసీదార్లకుగాని వారి వారసులకుగాని ఇవ్వబడును.

ప్రణయలత తెగినచో, పదిసంవత్సరాలు గతించాక భీమా సొమ్ము ఇవ్వబడును. ఈ లోపుగా దంపతులు కలసినట్లు ఆచోకీ దొరికితే సదరు సొమ్ము కంపెనీకి చెందును. విడాకులు కోర్టుద్వారా పొందితేనేతప్ప నమ్మబడవు.

ఇతరవిషయాలికి 1¼ అణాల స్టాంపుతో ఈ క్రింది చిరునామాకి వ్రాయాలి.

ది ప్రణయలత భీమాకంపెనీ, మన్మథపూర్.

కావాలి.—అన్నిచోటులా ఏజంట్లు, గొప్ప వేతనములపై కొలదిపని పూచీ, దరఖాస్తు వెంటనే పంపుడు.

## దం డో రా

మా వినోదినిలో ప్రకటింపబడు వ్యాసములలో నెవ్వియు నొక ప్రత్యేకవ్యక్తిని గాని, సంస్థనుగాని, సంఘమునుగాని నొప్పించుట కుద్దేశింపబడినవి కావని మా మనవి. ఇందు వచ్చు పాత్రలన్నియు హాస్యరసప్రదర్శనమునకై కల్పింపబడినవి.